క్లుప్తంగా

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



సుబ్బలక్ష్మి, రజనీలను సత్కరిస్తున్న ఎంఈఓ-2 సత్యనారాయణ తదితరులు

పెదపూడి: విధి నిర్వహణలో అందించే ఉత్తమ సేవలతో గుర్తింపు దానికదే వస్తుందని ఎంఈఓ-2 సత్యనారాయణ అన్నారు. కరకుదురు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పి.సుబ్బలక్ష్మి, జి.రజనీ బదిలీ అయ్యారు. బుధవారం వారికి సర్పంచ్ వుండ్రు చంద్రకళ అధ్యక్షతన అభినందన, వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలన్నారు. తద్వారా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.కమలా రాణి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీసెల్ ప్రతినిధి వాసంశెట్టి మాధవ, ఉపాధ్యాయురాలు టి.ఇందిర, ఎస్టీయూ ప్రతినిధి ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



పందలపాక పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం

బిక్కవోలు: మండలంలోని పలు ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం పరిశీలించారు. బుధవారం ఆయన పందలపాక ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. జేవీకే కిట్ల పంపిణీ, మధ్యాహ్నం భోజన పథకం నాణ్యతపై ఆరా తీశారు. నాడు-నేడు పథకంలో జరుగుతున్న పనులపై ఆయా పాఠశాలల యాజమాన్యాలతో సమీక్ష చేశారు. అనంతరం కొంకుదురు, మెళ్లూరు, బిక్కవోలు ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, మల్లిపూడి శ్రీనివాస్, గోర్స లక్ష్మి, పీబీ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి మరమ్మతులు

మధురపూడి: రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ గల 516ఈ జాతీయ రహదారికి మరమ్మతులు జరుగుతున్నాయి. ఏఈ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పనులు చురుకుగా నిర్వహిస్తున్నారు. అయ్యన గళ్లు కాలువకు ఆనుకొని ఉన్న బెర్మ్ ఇటీవల కిందికి దిగబడింది. కాలువలో వర్షపునీటి ప్రవాహం పెరగడంతో హైఎస్ బ్యాంక్‌మెంట్ కిందికి జారింది. దీనిని ఎత్తుచేయడంతో పాటు జియోగ్రిడ్‌తో పనులు నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా పనులు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పూడికతీత పనులు ప్రారంభం

బిక్కవోలు: పందలపాకలోని పంట కాలువలో పూడికతీత పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. పందలపాక- ఊలపల్లి లంక కాలువలో ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కాలువ ద్వారా సుమారు 400 ఎకరాల్లో సాగు జరుగుతుందన్నారు. పూడిక ఎక్కువగా ఉండటంతో నీరు వెళ్లడం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పనులు రైతుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయని అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి గండి వాసు, నాయకులు పడాల కృష్ణారెడ్డి, వంకా శ్రీను, బొడ్డు శ్రీనుపాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఐఓసీఎల్ సిబ్బంది

మధురపూడి: కోరుకొండ మండలం రాఘవపురంలో బుధవారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) పైప్‌లైన్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 2023-24 సంవత్సరానికి గాను స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. రాఘవపురం మీదుగా సీతానగరం మండలం మీదుగా వెళ్లే ఐఓసీఎల్ పైప్‌లైన్‌పై ఎటువంటి తవ్వకాలు నిర్వహించరాదన్నారు. అనంతరం 750 మొక్కలు నాటారు. ఆ సంస్థ చీఫ్ మేనేజర్ మిథున్‌కుమార్ శీలం, మేనేజర్ హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగింది.

మత్తుకు దూరంగా ఉండాలి

గోకవరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సంజీవయ్య నగర్‌లోని ఎస్సీబాలుర వసతి గృహంలో విద్యార్థులకు డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కోరుకొండ సీఐ వై.ఉమామహేశ్వరరావు, ఏఎస్సై టీవీ రెడ్డి, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి.. సేవా వారధి

- పథకాల అమలులో వలంటీర్లే కీలకం
- ప్రతి ఇంటికీ చేరిన సంక్షేమం

బిక్కవోలు/అనపర్తి/మధురపూడి: ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి తలుపుతట్టి పింఛను ఇచ్చి ఆనందం నింపేది వలంటీర్లే.. సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించేదీ వారే.. కరోనా కష్ట సమయంలోనూ మేమున్నామంటూ భరోసా ఇచ్చి సేవలతో మురిపించిందీ ఆ సారథులే.. గూడు లేని పేదలు ప్రభుత్వం ఇచ్చే స్థలాలు పొందేందుకు వీరి కృషి ఎనలేనిది.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచింది. ఆచరణ యోగ్యంగా మారింది. సామాన్యులకు వారు అందిస్తున్న సహకారం మరువలేనిది. అలాంటి వలంటీర్ల సేవలు తెలుసుకుందాం రండి.

కార్యాలయాల చుట్టూ తిరగకుండా..



మా పిల్లల చదువు కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. జగనన్న సురక్షలో భాగంగా మా ఇంటికి వచ్చిన వలంటీర్ ఈ విషయం తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పత్రాలను తీసుకుని నాతో దరఖాస్తు చేయించారు. అనంతరం గ్రామసభలో అందజేశారు. గతంలో వీటి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది.

– చొంగా వెంకటలక్ష్మి, రాఘవపురం, కోరుకొండ మండలం

ఆరోగ్యశ్రీ కార్డు వచ్చింది



ఆరోగ్యశ్రీ కార్డు కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాను. మా వలంటీర్ ఈ విషయం తెలుసుకుని మాకు సాయం చేశారు. సంబంధిత పత్రాల జిరాక్సులు తీసుకుని జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేయించారు. ఇటీవల జరిగిన గ్రామసభలో నాకు ఆరోగ్య శ్రీ కార్డు అందించారు. వలంటీర్ సాయం చేయడంతో చాలా సులువుగా నా సమస్య పరిష్కారమైంది.

– మెల్లిమి మంగ, రాఘవపురం, కోరుకొండ మండలం

ఎంతో మేలు



మాది పందలపాక సచివాలయం -1 పరిధి. నాకు వలంటీర్ గొర్రిపోటి మమత సహకారంతో ఎంతో మేలు జరిగింది. అభయ హస్తం కింద రూ.500 వచ్చేది. ఇప్పుడు వితంతు పింఛన్ కూడా ఇప్పించారు. ఇప్పుడు రెండు పింఛన్లు తీసుకుని ఆనందంగా జీవిస్తున్నా. ప్రతి నెలా 104 వచ్చినప్పుడు వైద్య సేవల గురించి వివరిస్తున్నారు. కరోనా కష్టకాలంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న సమయంలో తీసుకోవాల్సిన సలహాలు అందించారు. ఇప్పుడు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఇస్తున్నారు.

– సిరపరపు నారాయణమ్మ, పందలపాక

సేవలు అద్భుతం



అనపర్తి ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాం. జగనన్న ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో మా కుటుంబానికి ప్రభుత్వ సేవలన్నీ శ్రమ లేకుండా వలంటీరే అందిస్తున్నారు. రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని మా వలంటీర్ అపర్ణకు తెలియజేశాను. దీంతో ఆమె వీటికి సంబంధించి దరఖాస్తు చేసి మేము ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా కార్డులు, ధ్రువపత్రాలు మా ఇంటి ముంగిటకు తీసుకువచ్చి అందజేసింది.

– మీసాల దుర్గాంబిక, అనపర్తి

సేవలకు కృతజ్ఞతలు



పొలాన్ని కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. కౌలు కార్డు వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకుని వలంటీర్‌ను సంప్రదించాను. ఆయన అడిగిన పత్రాల జిరాక్సులు ఇచ్చాను. మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష సభలో నాకు కార్డు అందించారు. వలంటీర్ సేవలకు కృతజ్ఞతలు.

– వంకా గంగాజలం, రాఘవపురం, కోరుకొండ మండలం

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



పెదపూడిలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్



సింగంపల్లిలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెదపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. బుధవారం పెదపూడిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ కలవల కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందుతున్న అర్హులతో పాటు ఇంకా లబ్ధి పొందని వారికి ఏ సమస్య వచ్చినా తక్షణం పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ప్రజలకు అవసరమైన ఏ సమస్యనైనా అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కారం పొందాలన్నారు. అనంతరం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ టి.సుభాష్, ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసుచౌదరి, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరుగా అర్హుల ఇంటికే సేవలు

రంగంపేట: అర్హులందరికీ ఇంటి వద్దకే సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు అన్నారు. సింగంపల్లి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా స్వగ్రామంలోనే ఉచితంగా అందజేస్తున్నారని అన్నారు. అనంతరం 1,023 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య, సర్పంచ్ టి.శివశంకరానంద్, ఉప సర్పంచ్ సోమిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాజప యజ్ఞం

పెదపూడి: భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి 2025 నవంబర్ 23 నాటికి, 108 కోట్ల శ్రీసత్యసాయి లిఖిత నామ మహాజప యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని కాకినాడ జిల్లా శ్రీసత్యసాయి సేవా సమితి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు తెలిపారు. బుధవారం పెదపూడిలో ఆయన మాట్లాడుతూ త్రికరణ శుద్ధిగా సాయి నామాన్ని ఉచ్చరిస్తూ లిఖిత నామ యజ్ఞాన్ని పూర్తి చేయాలన్నారు. నిరంతర ఆధ్యాత్మిక సాధనకు లిఖిత నామ యజ్ఞం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దీక్షగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. మహాయజ్ఞానికి సంబంధించిన ఫ్లెక్సీలను ఆవిష్కరించాలని ఆయన కోరారు.

15న మోటార్ సైకిళ్లకు వేలం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ఎస్ఈబీ స్టేషన్‌లోని 12 ద్విచక్ర వాహనాలకు ఈనెల 15వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. వివిధ కేసుల్లో నిందితుల నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. వేలం అనంతరం ఆ రుసుమును తిరిగి చెల్లిస్తామన్నారు.

రాజానగరం పీహెచ్‌సీలో అరకొర వైద్యం

- మండల పరిషత్ సభ్యుల ఆగ్రహం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయం
- మండల సమావేశంలో తీర్మానం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సీతారత్నం

రాజానగరం: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యతనిస్తుంటే మండలంలో మాత్రం వైద్యులు, సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజాపరిషత్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు ఏమాత్రం బాగోలేదన్నారు. మండల సమావేశాలకు కూడా వైద్యులు గైర్హాజరు అవుతున్నారంటూ, దీనిపై కలెక్టరుకు ఫిర్యాదు చేయాలని ఎండీఓను కోరుతూ తీర్మానించారు. ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో శాఖల వారీగా సమీక్షించారు. వైద్యరంగంపై రాజానగరం సర్పంచ్ కుందేటి ప్రసాద్ మాట్లాడుతూ తమ గ్రామంలో పేరుకే ప్రభుత్వాస్పత్రి ఉందని, ఇక్కడ ఎవ్వరికీ సరైన వైద్యసేవలు అందడం లేదని విమర్శించారు. ఆస్పత్రిలో చేరిన ఒక గర్భిణికి సకాలంలో సరైన వైద్యం అందక ఇబ్బంది పడుతుంటే తానే రాజమహేంద్రవరం పంపించానన్నారు. కుక్క కాటుకు గురై ఎవరైనా వస్తే వ్యాక్సిన్ లేదని పంపించేస్తున్నారని, రికమండేషన్ చేస్తేనే గానీ బాధితుడికి వ్యాక్సిన్ వేయడం లేదని ఎంపీపీ సీతారత్నం ఆరోపించారు. పాలచర్ల పీహెచ్‌సీ తీరు కూడా ఇందుకు ఏమాత్రం తీసిపోలేదని, ఇటీవల కలెక్టర్ ఆ ఆస్పత్రిని సందర్శించి, చివాట్లు పెట్టి, ఒక ఉద్యోగిని సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. రాజానగరం పీహెచ్‌సీలో టీటీ ఇంజక్షన్ కూడా చేయడం లేదని, బయట కొనుగోలు చేసి తీసుకురావాల్సి వస్తోందని ఉపాధ్యక్షురాలు కొల్లి సత్య ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పీహెచ్‌సీపై చాలా ఆరోపణలు వస్తున్నాయని, గత మూడు సమావేశాలకు కూడా వైద్యులు హాజరు కాలేదని ఎంపీడీఓ బి.రామారావు అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించడంతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులందరూ ఉపయోగించేలా చూడాలని రాజానగరం సర్పంచ్ కోరారు. సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యుడు కోడి రాఘవ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, డిప్యూటీ తహసీల్దార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం



ఉత్తమ పూర్వ విద్యార్థిగా అవార్డు అందుకుంటున్న రాజారెడ్డి

పెదపూడి: సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్న ఆర్గానిక్ చిల్లీ ఫారమ్స్, తాతారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జి.మామిడాడకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి, లయన్స్ క్లబ్ శ్రీసూర్య క్లబ్ మెంటర్ మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రావులపాలేనికి చెందిన కర్రి కొండన్న వారి తాతారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, రాజమహేంద్రవరానికి చెందిన ఆర్గానిక్ చిల్లీ ఫారమ్స్ లిమిటెడ్ సంయుక్తంగా రావులపాలెంలో బుధవారం రాష్ట్ర సాయిలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేసింది. ఇందులో తనకు ఉత్తమ పూర్వ విద్యార్థి అవార్డు లభించిందని రాజారెడ్డి వివరించారు. న్యాయవాదిగా, లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు, పూర్వ విద్యార్థిగా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సేవలకు ఈ అవార్డు లభించిందన్నారు. రాజారెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

నేడు గ్రామ సభలు

సీతానగరం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా చినకొండేపూడి 1లో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు, మిర్తిపాడులో ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురిని వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాజానగరం: దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు చెందిన 90 మంది విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరావు, ట్రస్టు సభ్యుడు సుంకర నాగేశ్వరరావు వీటిని వీటిని అందజేశారు.

టీడీపీ నాయకుడు బాబూరావుపై కేసు

సీతానగరం: కాటవరం సమీపంలోని బర్ల వేబ్రిడ్జి వద్ద గల తమ సిబ్బందిని టీడీపీ నాయకుడు బర్ల బాబూరావు తిడుతూ, భయపెడుతున్నాడని జేపీ కంపెనీకి చెందిన వాసపల్లి రాంబాబు, సిద్దాబత్తుల వివేక్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బర్ల వేబ్రిడ్జిని బాబూరావు నుంచి జేపీ కంపెనీ నెలకు రూ.1.30 లక్షలు ఇచ్చేలా లీజుకు తీసుకుంది. అయితే ఇటీవల బాబూరావు వేబ్రిడ్జి వద్దకు వచ్చి సిబ్బందిని రూ 2.లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. వారిని తిడుతూ, భయపెడుతున్నాడు. అలాగే బుధవారం మునికూడలి ఇసుక ర్యాంపు వద్దకు కొందరితో వచ్చి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారంటూ లారీలను అడ్డగించాడు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కుతుకులూరులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కుతుకులూరులో గడప గడపకూ..

అనపర్తి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం కుతుకులూరు 9, 10వ వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దీనికి అనుగుణంగా రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మిగిలిన లబ్ధిదారులకూ న్యాయం చేసేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. ఇది ప్రజలకు వరంగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరిసాయికృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, పీహెచ్‌సీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బుచ్చెంపేటలో గడప గడపకూ..

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బుచ్చెంపేటలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం రాత్రి 9 గంటల వరకూ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా ఇంటింటికీ తిరిగి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. నాలుగేళ్లలో ప్రభుత్వం వారికి అందించిన పథకాల లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ గ్రామాభివృద్ధికి రూ.4 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్, బల్క్‌మిల్క్ కేంద్రం నిర్మించామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తొలుత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కోకన్వీనర్ గణేశుల పోసియ్య, డీవీఎంసీ మెంబర్ ఇందుగమెల్లి సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ తాడేపల్లి జ్యోతి, ఎంపీటీసీ తాడేపల్లి మేరీ, పార్టీ నాయకులు మద్దాల చంటిబాబు, జొన్నకూటి వందన కుమార్, తాడేపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

దిగజారుడు వ్యాఖ్యలు మానుకో..

- పవన్‌కళ్యాణ్‌కు వలంటీర్ల హెచ్చరిక
- అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం



పందలపాకలో పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసన తెలుపుతున్న వలంటీర్లు

బిక్కవోలు: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని పందలపాక వలంటీర్లు హితవుపలికారు. పవన్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై అంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. పవన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో తాము ప్రజలకు అందించిన సేవలు గుర్తులేవా అని అడిగారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించడంలో కీలకంగా వ్యవహరిస్తూ అందరికీ బంధువుల్లా మారామని అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా దిగజారుడు వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పందలపాక సచివాలయం 1, 2 పరిధిలోని వలంటీర్లు పాల్గొన్నారు.

ఐఎస్‌టీఎస్‌లో సినిమా బృందం సందడి



విద్యార్థినులతో డ్యాన్సు చేస్తున్న హీరో, హీరోయిన్లు

రాజానగరం: స్లమ్ డాగ్ హస్బెండ్ చిత్ర బృందం బుధవారం ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా హీరో సంజయ్ (నటుడు బ్రహ్మాజీ కుమారుడు), హీరోయిన్ ప్రణవి, జబర్దస్ ఫేమ్ యాదమ్మ, రాజు విచ్చేశారు. కొద్దిసేపు విద్యార్థినులతో కలిసి సందడి చేశారు. తమ సినిమా ప్రత్యేకతలను వివరించారు. హీరో, హీరోయిన్లు సినిమాలోని పాటలను ప్లే చేసి, విద్యార్థినులతో కలిసి డ్యాన్సులు చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చినకొండేపూడిలో డాక్టర్ విజయ్‌కుమార్, నవాబులను పరామర్శిస్తున్న విజయలక్ష్మి

సీతానగరం: మండలంలో పలువురు బాధితులను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి బుధవారం పరామర్శించారు. రఘుదేవపురంలో చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న బిక్కిన నాగేంద్రతో మాట్లాడారు. ఇటీవల మృతి చెందిన గుర్రాల నాగేశ్వరరావు, నారా గోపాల్ వీరబాబు కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీతానగరంలో అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటివద్ద ఉన్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వసంతరావు భార్యను పరామర్శించారు. వంగలపూడిలో నీరుకొండ అన్నపూర్ణ కుటుంబ సభ్యులను, పురుషోత్తపట్నంలో మాసిన రామకృష్ణ, సింగవరంలో కప్పలయ్య వెంకటేశ్వరరావు, సుంకర ఏడుకొండలు, సూర్యచంద్రరావు కుటుంబ సభ్యులను ఓదార్చారు. చినకొండేపూడి చెందిన కురుకూరి సరితమ్మ మరణించగా ఆమె కుమారుడు నవాబు, మనువడు రాజమహేంద్రవరం సాయి హాస్పటల్ అధినేత డాక్టర్ విజయ్ కుమార్‌ను, కోసూరి సతీష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదల్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

గోకవరం: స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు నూరుశాతం రాయితీపై కంది విత్తనాలను పంపిణీ చేశారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా సుమారు 200 కేజీల విత్తనాలను రైతులకు అందజేశారు. రైతులు పొలం గట్లపై ఎకరాకు పావు కేజీ విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.